శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## వార్త నూతన సంవత్సర క్యాలెండర్ 2026 ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల

"వార్త" క్యాలెండర్ ఆవిష్కరించడం చాలా సంతోషకరం జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల





**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 30, ప్రభాతవార్త** మంగళవారం నగరంలోని స్తానిక కలెక్టరేట్ లోని తిక్కన భవన్ లో ప్రముఖ జాతీయ దినపత్రిక "వార్త" నూతన సంవత్సర కాలెండర్ 2026 ను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిజాలని నిర్భయంగా రాస్తూ, ప్రజలపక్షాన ఉన్న వార్త దినపత్రిక క్యాలెండర్ ని తమ చేతుల మీదగా ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. విలేకరులు రాసె వార్తలు సమాజ హితానికి ఉపయోగ కారిగా ఉండాలనన్నారు. అనంతరం వార్త జిల్లా కార్యాలయ సిబ్బంది కలెక్టర్ని పుష్పగుచ్చాలతో, శాలువాకప్పి ఘనంగా సత్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి వార్త సిటీ, మండల రిపోర్టర్ అందరూ వచ్చి దిగ్విజయంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ బాలసుబ్రమణ్యం, యాడ్స్ ఇన్‌ఛార్జీ మస్తాన్, నెల్లూరు ఆర్సీ ఇన్‌ఛార్జీ నరేంద్రబాబు, సీనియర్ రిపోర్టర్ శివ, కలెక్టరేట్ రిపోర్టర్ షేక్.రిజ్వాన్, వ్యవసాయం రిపోర్టర్ సుబ్బయ్య, ఫోటోగ్రాఫర్ మాల్యాద్రి, సైదాపురం రిపోర్టర్ వేణు, వింజమూరు రిపోర్టర్ నరసింహులు, డెస్క్ ఇన్‌ఛార్జీ సతీష్, డెస్క్ సిబ్బంది ఫణికుమార్, సిద్దు సురేంద్రనాధ్ తదితరులు పాల్గొన్నారు

## కలెక్టర్ హిమాన్ష్ శుక్లాతో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి భేటీ



**నెల్లూరు, డిసెంబర్ 30, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో భేటీ అయ్యారు. మంగళవారం సాయంత్రం నెల్లూరులోని కలెక్టర్ బంగ్లా కు చేరుకున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి కలెక్టర్ హిమాన్షు శుక్లా స్వాగతం పలికారు. అనంతరం ఇరువులు భేటీ అయి జిల్లాకు సంబంధించి వివిధ అంశాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

# పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి నారాయణ
- ఐదవ డివిజన్లోని వైకుంఠపురంలో పర్యటించిన మంత్రి
- స్థానిక గిరిజన సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తామంటూ హామీ
- ఇచ్చిన మాట ప్రకారం వారంలోపే తమ ప్రాంతానికి వచ్చిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు



**నెల్లూరు, డిసెంబర్ 30, ప్రభాతవార్త-వైద్యం** పేదల అభ్యున్నతి కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని ఐదో డివిజన్లో వైకుంఠురంలో పర్యటించారు. వారం క్రితం ఆ ప్రాంత వాసుల ముంపు సమస్యను తన దృష్టికి తీసుకుని వచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం అధికారులతో కలిసి వైకుంఠపురం ఏరియాలో పర్యటించినట్లు చెప్పారు. ఇంటింటికి వెళ్లి గిరిజనుల సమస్యలను తెలుసుకుని వారి సమస్యల పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇబ్బందులు చెప్పిన వారంలోపే తమ ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రికి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. గత వారంలో ఇచ్చిన మాట ప్రకారం ఈ రోజు వైకుంఠపురానికి రావడం జరిగిందని, ప్రతి గడపకు వెళ్ళినప్పుడు వారి యొక్క సమస్యను తెలియజేశారని తెలిపారు. అధికారులకు సమక్షంలోనే సమస్యను పరిష్కరిస్తామని మంత్రి చెప్పారు. వర్షాల్లో ముంపుకు గురయ్యే 22 ఇళ్ళను గుర్తించామని, వాళ్ళ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. స్లమ్ ఏరియాల అభివృద్ధిపై సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. వైజాగ్ లక్ష్మీపురం స్లమ్ ప్రాంతంలో 170 కుటుంబాల కోసం పీపీపీలో 20 అంతస్తుల భవనం నిర్మిస్తున్నామన్నారు. పేదల అభ్యున్నతే మా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, ఇన్‌చార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు మామిడాల మధు, డివిజన్ ప్రెసిడెంట్ గంగాధర్, కోదండరామాలయ చైర్మన్ సిరి శ్రీనివాస్, కార్పొరేషన్, రెవెన్యూ, ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు.

## బీద రవిచంద్రకు అభినందనలు తెలిపిన కావలి ఎమ్మెల్యే



**కావలి, డిసెంబర్ 30 ప్రభాతవార్త :** తెలుగుదేశంపార్టీ నెల్లూరు పార్లమెంటు జిల్లా అధ్యక్షులుగా నియమితులైన బీద రవిచంద్రని హైదరాబాద్‌లో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి దుశ్యాలవాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేసి హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మూడవసారి జిల్లా టిడిపి అధ్యక్ష బాధ్యతలను చేపట్టిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర విజయవంతంగా బాధ్యతలు నిర్వర్తించి అందరి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం ఇద్దరూ సుదీర్ఘంగా రెండు గంటలు సేపు పలు అంశాల మీద చర్చించుకోవడం జరిగింది.

## బిపిఎస్‌పై ఎల్‌టిపిలతో కమిషనర్ సమీక్ష



**నెల్లూరు కార్పోరేషన్, డిసెంబర్ 30 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్‌లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్, బిపిఎస్ పథకాల పట్ల అర్హులైన ప్లాట్లు, భవనాల యజమానులకు అవగాహన కల్పించి పథకాలను సద్వినియోగం చేసుకోవడంలో భాగస్వాములు కావాలని సూచించారు. బిపిఎస్ పథకం ద్వారా అనుమతులను అతిక్రమించి కట్టిన కట్టడాలకు పూర్తిస్థాయిలో యాజమాన్యపు హక్కును పొందడమే కాకుండా ఆస్థిపన్ను, కుళాయిపన్ను, విద్యుత్‌బిల్లు తదితర వాటిలో అధిక మొత్తం అపరాధరుసుం చెల్లించకుండా సడలింపులు పొందేందుకు కూడా అర్హులవుతారని వివరించాలని ఎల్‌టిపిలకు కమిషనర్ సూచించారు. నిర్దేశించిన గడువులోపు అర్హులైన అందరి దావరా ఎల్ఆర్ఎస్ బిపిఎస్ పథకాలను అందించేలా భాగస్వాములై పథకాలను విజయవంతం చేయాలని కమీషనర్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో నెల్లూరు నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ హిమబిందు, ఇన్‌చార్జ్ సిటి ప్లానర్ రఘునాథరావు, ఏసీపీలు ఎల్‌టిపిలు పాల్గొన్నారు.

## డైరెక్టర్ అరుణ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసిన కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, డిసెంబర్ 30 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ విభాగం మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్‌బాబును నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్ మంగళవారం స్థానిక మినర్వాగ్రాండ్ హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకొని పూలమొక్కను బహుకరించారు. నెల్లూరు నగరపాలక సంస్థకు సంబంధించిన హౌసింగ్ అంశాలపై ఇరువురు చర్చించారు.

## శ్రీవారిని దర్శించుకున్న వేమిరెడ్డి దంపతులు



**కోవూరు, డిసెంబరు 30 ప్రభాతవార్త :** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం తెల్లవారు జామున నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు ప్రశాంతిరెడ్డి దంపతులు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం కొనసాగాలని ఈ సందర్భంగా స్వామివారిని కోరుకున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## నగరంలో వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

- విష్ణునామస్మరణలతో మార్మోగిన వైష్ణవాలయాలు



**నెల్లూరు, డిసెంబరు 30 ప్రభాత వార్త-విద్య** నెల్లూరు నగరంతోపాటూ జిల్లా వ్యాప్తంగా ప్రజలు ముక్కోటి పర్వదిన వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. నగరంలోని స్థానిక రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాధస్వామి ఆలయం, మాగుంట లే అవుట్‌లోని శ్రీ వెంకటేశ్వరసామి వారి ఆలయం, పడారుపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, దర్గామిట్టలోని శబరి శ్రీరామక్షేత్రం, వెంకటేశ్వపురంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం, మైపాడు రోడ్డులోని ప్రసన్న వెంకటేశ్వరుని ఆలయం, బాలాజీ నగర్‌లోని శ్రీ సీతారామ మందరాల్లో వైకుంఠ ఏకాధశిని పురస్కరించుకని ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లను చేశారు. కాగా పండుగను పురస్కరించుకుని భక్తులు తెల్లవారుజామునుండే ఆలయాలకు చేరుకుని క్యూలైన్లలో వేచి ఉండి ఉత్తర ద్వారం ద్వార ఆలయంలోని ప్రవేశించి దైవ దర్శనం చేసుకున్నారు. అలాగే భక్తులుప్రత్యేక పూజలు సైతం నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. నగరంలోని స్థానిక రంగనాధస్వామి ఆలయంలో భక్తుల రద్దీ ఒక్కసారిగా విపరీతంగా పెరిగిపోయింది. అధికారులు ఏర్పాటుచేసిన క్యూలైన్లు భక్తులకు సరిపోక పోవటంతో క్యూలైన్లు పెన్నా బేరేజీ పైన వరకు నిలిచిపోయింది. ఆలయ సిబ్బంది, పోలీసులు తీవ్రంగా శ్రమించి లైన్లకు క్రమబద్ధీకరించారు. అవాంచనీయ సంఘటలను జరుగ కుండా పోలీసులు మొందస్తు చర్యలు చేపట్టారు. కొన్న స్వచ్ఛంద సంస్థలు, భక్త సమూహాలు భక్తులకు ఉచిత ప్రసాదాల వితరణ, మంచినీటి పంపిణీ చేపట్టారు.



## వీఆర్ హైస్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించిన మంత్రి నారాయణ



**నెల్లూరు, డిసెంబర్ 30, ప్రభాతవార్త-వైద్యం** నగరంలోని వీఆర్ హైస్కూల్‌ను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న విద్యపై మంత్రి నారాయణ ఆరా తీశారు. మెరుగైన విద్యా విధానంపై ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. సిటీలోని ప్రభుత్వ హైస్కూల్స్ అభివృద్ధిపై విద్యాశాఖాధికారులతో ఆయన సమీక్షించారు. ఫౌండేషన్ కోర్సుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫౌండేషన్‌పై ఆసక్తి చూపిన విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు. సైన్స్ ఫేర్‌లో ప్రతిభ చాటిన 15 మంది చిన్నారులకు అవార్డులు, బహుమతులు అందజేశారు. అనంతరం డ్రైవింగ్ హాల్ నిర్మాణ పనులు పరిశీలించి మీడియాతో మాట్లాడారు. వీఆర్ హైస్కూల్‌లో విద్యార్థుల ప్రతిభ చూస్తుంటే సంతోషంగా ఉందని, వీఆర్సీ తరహాలో మరో 15 స్కూల్స్ సిద్ధమవుతున్నాయన్నారు. స్కూళ్ల ఆధునీకరణకు ముందుకొచ్చిన దాతలకు అభినందనలు తెలియజేశారు. మన్సూర్ నగర్‌లోని ఐదెకరాల వక్ఫ్‌బోర్డు స్థలంలో అన్ని హంగులతో నూతన స్కూల్ నిర్మిస్తామని సిటీ లోని ప్రభుత్వ స్కూల్స్‌లో 6500 మంది విద్యాభ్యాసం చేస్తున్నారని తెలియజేశారు. వారిలో 1500 మంది ఫౌండేషన్ కోర్సుపై ఆసక్తి చూపారన్నారు. వారందరికి నారాయణ మెటీరియల్ ఉచితంగా అందిస్తామన్నారు. పేద పిల్లలకు మంచి విద్య ఇవ్వాలన్నదే నా సంకల్పం అని మంత్రి నారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమీషనర్ నందన్, డీఈఓ బాలాజీ రావు, ప్రిన్సిపాల్, స్థానిక టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సొంత ఇంటిని పూర్తి చేసి ఇవ్వడమే ప్రధాన లక్ష్యం

- ఆప్షన్..3 ఇళ్ల లోటుపాట్లును సరిచేయండి
- బిల్లులు చెల్లిస్తున్నాం
- ఏజెన్సీలకు హౌసింగ్ ఎండి అరుణ్‌బాబు సూచన



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 30, ప్రభాతవార్త** పేదలకు సొంత ఇంటిని పూర్తి చేసి ఇవ్వడమే ప్రధాన లక్ష్యంగా గృహ నిర్మాణశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మేనేజింగ్ డైరెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో కలిసి జిల్లాలో గృహనిర్మాణాల పురోగతిపై మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్‌బాబు అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆప్షన్..3 ఇళ్ల లోటుపాట్లును సరిచేయండి. బిల్లులు చెల్లిస్తున్నాం.. ఏజెన్సీలకు హౌసింగ్ ఎండి అరుణ్‌బాబు సూచన అని ఆప్షన్3 క్రింది నిర్మించిన ఇళ్లల్లో నాణ్యతగా లేని వాటిని గుర్తించి లోటుపాట్లను వెంటనే సరిచేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. జిల్లాలో సుమారు 6899 ఇళ్లల్లో శ్లాబులు, గోడ నిర్మాణాలు, బేస్‌మెంట్లు నాణ్యతా ప్రమాణాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. యుద్ధప్రాతిపదికన ఈ ఇళ్ల నిర్మాణాల మరమ్మతులు చేపట్టి లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు. పూర్తి చేసిన ఇళ్లకు వెంటనే బిల్లులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఏజెన్సీల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం భరోసాగా ఉంటుందని, ఇది చివరి అవకాశంగా భావించి వెంటనే ఆప్షన్ 3 ఇళ్లను పూర్తిచేయాలన్నారు.

**ఉగాది లోపు లక్ష్యాలను అధిగమించాలి.. బాధ్యతగా పనిచేయండి**

జిల్లాలో గృహనిర్మాణశాఖ అధికారులు బాధ్యతగా పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉగాదిలోగా ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించారని, ఈ మేరకు జిల్లాకు కేటాయించిన 27820 ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేందుకు పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఏజెన్సీల కాంట్రాక్టర్లను సమన్వయం చేసుకుంటూ ప్రతిరోజూ ఆప్షన్ 3 ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించాలన్నారు. ఏఈలు, డిఇలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధతో ఇళ్ల నిర్మాణాల స్టేజ్ కన్వర్జేషన్లు పూర్తిచేయాలన్నారు. జిల్లాలో గుర్తించిన నాణ్యతా ప్రమాణాలు లేని ఇళ్ల నిర్మాణాలను కాంట్రాక్టర్లచేత సరిచేయించి వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. ఇళ్లల్లో చేరిన లబ్ధిదారులకు అవసరమైన అదనపు సహాయాన్ని ప్రభుత్వం చేస్తుందన్నారు. ఫ్యాన్లు, లైట్లకు, అదనపు నిర్మాణాలను నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. నూతనంగా పిఎంఎవై 2.0లో మంజూరైన ఇళ్లను మొదలుపెట్టించాలన్నారు.

**పోటీతత్వంతో పనిచేయండి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ ఉగాదిలోగా జిల్లాకు కేటాయించిన ఇళ్లను పూర్తి చేసేందుకు అధికారులందరూ ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఈ మూడునెలల సమయం చాలా కీలకమైందన్నారు. పోటీతత్వంతో గృహనిర్మాణశాఖ అధికారులు పనిచేయాలన్నారు. గృహనిర్మాణాలకు సంబంధించి పూర్తిస్థాయిలో సిమెంటు, స్టీలు, మెటీరియల్ అందుబాటులో వుందన్నారు. బిల్లులు కూడా త్వరగా మంజూరు అవుతున్నట్లు చెప్పారు. అధికారులు కాంట్రాక్టర్లను సమన్వయం చేసుకుంటూ ఆప్షన్ 3 ఇళ్లను వేగంగా పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. అలాగే ఆప్షన్ 3లో గుర్తించిన నాణ్యత లేకుండా నిర్మించిన ఇళ్లను తిరిగి నాణ్యతాప్రమాణాలతో నిర్మించాలని సూచించారు. వీలైనన్ని ఎక్కువ ఇళ్లను పూర్తిస్థాయిలో నిర్మించి పేదలకు అందించడమే లక్ష్యంగా బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో గృహనిర్మాణశాఖ అధికారులు మోహన్ రావు, మాధవరావు, ఏఈలు, డిజిటల్ అసిస్టెంట్లు, వివిధ ఏజెన్సీల కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## ఇఫ్కో కిసాన్ సెజ్ పరిశ్రమలపై ప్రజాభిప్రాయ సేకరణ

- స్థానికులకు మొదటి ప్రాధాన్యత - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల





**కొడవలూరు, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** కొడవలూరు మండలం రేగడిచెలిక పంచాయతీలో ఉన్న ఇఫ్కో కిసాన్ సెజ్ ఇండస్ట్రియల్ పార్కులో నూతనంగా నిర్మించబోతున్న మేస్సర్స్ ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కోఆపరేటివ్ లిమిటెడ్, మేస్సర్స్ రామ్కి బయో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు హాజరై స్థానిక రైతులు, ప్రజల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు పరిశ్రమల ఏర్పాటు వల్ల నీటి, వాయు కాలుష్యం పెరిగి తమ పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, పరిశ్రమల నిర్మాణం మరియు కార్యకలాపాల దశలో స్థానికులకు ఉపాధి కల్పించాలని కోరారు. పరిశ్రమల కారణంగా భూగర్భ జలాలపై ప్రభావం, సాగునీటి లభ్యత, ఆరోగ్య సమస్యలపై స్పష్టమైన హామీలు ఇవ్వాలని రైతులు ప్రశ్నలు లేవనెత్తారు. ఈ ప్రశ్నలకు కంపెనీల ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమాధానాలు ఇస్తూ కాలుష్య నియంత్రణకు తీసుకునే చర్యలను వివరించారు. నీటి శుద్ధి ప్లాంట్లు, వాయు కాలుష్య నియంత్రణ పరికరాలు, వ్యర్థాల నిర్వహణ విధానాలు, పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా పరిశ్రమలు నిర్వహిస్తామని తెలిపారు. రైతుల పంటలకు ఎలాంటి నష్టం కలగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ ప్రజలు, రైతులే ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు ముందుగా తాగునీటి అవసరాలకు, అనంతరం వ్యవసాయానికి నీటిని కేటాయించి, ఆ తర్వాతే పరిశ్రమలకు నీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. పరిశ్రమల నిర్మాణ దశలోనే కాకుండా కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత కూడా స్థానికులకు ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు కల్పించాలని కంపెనీ ప్రతినిధులను కోరారు. దీంతో పాటు పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ఎలాంటి రాజీ ఉండదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి, ఎంపీడీవో వెంకట సుబ్బారావు, గ్రామ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి ఉత్తమ కార్యకర్తలకు సర్టిఫికేట్లు పంపిణి



**బుచ్చి డిసెంబర్ 30 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని ఎవిఆర్ కళ్యాణ మండపంలో టిడిపి ఉత్తమ కార్యకర్తలకు సర్టిఫికేట్లు పంపిణి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతు సుపరిపాలనలో యాక్టివ్‌గా పనిచేసిన ఉత్తమ కార్యకర్తలకు సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారికి సర్టిఫికేట్లు అందజేసి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు పార్టీ కార్యకర్తల సహకారంతోనే తాను ఎమ్మెల్యేగా గెలిచినట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలే పార్టీకి బలమని ప్రశంసించారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరిని పదవులు ఇచ్చి గౌరవించడం జరిగిందని అన్నారు. పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని అన్నారు. తమ పార్టీలో ఎటువంటి వర్గాలు లేవని ఆమె స్పష్టం చేశారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామిని నెరవేస్తున్నామని అన్నారు. కోవూరు నియోజకవర్గంలో 100 కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీని గ్రేడ్2కి మార్చామన్నారు. పదిమందికి సహాయం చేసే ప్రతి ఒక్కరు నాయకులే అని చెప్పారు. రాబోయే రోజులలో కోవూరు నియోజకవర్గంలో ఒకే నినాదం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు యర్రంరెడ్డి గోవర్దన్‌రెడ్డి, పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, పార్లమెంటరీ ఉపాధ్యాక్షులు ఎం.వి శేషయ్య, జొన్నవాడ దేవస్ధాం చైర్మన్ అశోక్‌రెడ్డి, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, రూరల్ బ్యాంకు అద్యక్షులు ఏటూరు శివరామకృష్ణారెడ్డి, వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మి, ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు, టౌన్ అద్యక్షులు గుత్తా శ్రీనివాసులు, రూరల్ అద్యక్షులు జదీష్, వింజం రామానాయుడు, మైనార్టీ నాయకులు సుభానీ వల్లూరు రాఘవరెడ్డి, ఇప్పగుంట సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, మైనార్టీనాయకులు పఠాన్ మహబూబాషా, షబ్బీర్, నస్రీన్, కౌన్సిలర్ తాళ్ళ వైష్ణవి, చేనేత రాష్ట్ర డైరక్టర్ తాళ్ళ నరసింహస్వామి, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ, కౌన్సిలర్ శ్రీదేవి, కౌన్సిలర్ రాచూరుసత్యనారాయణ, దుగ్గిశెట్టి హరినాద్, కిషోర్, పెనుబల్లి సర్పంచ్ ఓడా పెంచలయ్య, రజనీ, తమ్మిరెడ్డి మల్లికార్జున, రేబాల నాయకులు శ్రీకాంత్, పలువురు టిడిపినాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## జనవరి 2వ తేది నుండి కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ

- జనవారి 02 నుండి 09 వరకు సంబంధిత ప్రజాప్రతినిధుల సమక్షంలో పంపిణీ
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 30: ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి మండలంలోను సంబంధిత గ్రామాలలోను కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని 02.01.2026 నుండి 09.01.2026 వరకు సంబంధిత ప్రజాప్రతినిధుల సమక్షంలో పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

